సాక్షి ఆదిలాబాద్

శనివారం । 10 । మే । 2025



జీవన రేఖ.. వివక్షకు ప్రతీక
నిర్మల్ జిల్లాకు బాసర–లక్సెట్టిపేట రహదారి జీవన రేఖగా ఉంది. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలుపుతూ 175 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. 10లో▸



‘ఉపాధి’ సిబ్బంది కొరత
గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు తప్పని పరిస్థితి. 11లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.0/28.0
చాలా వరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

న్యాయవాదుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: ఉగ్రవాదం రూపుమాపడమే లక్ష్యంగా పాకిస్తాన్‌తో యుద్ధానికి దిగిన భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.నగేశ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పట్టణంలో న్యాయవాదులు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. న్యాయస్థాన ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ చౌక్ మీదుగా సాగింది. ఇందులో కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అకాల వర్షం



తాంసిలో జొన్నలపై టార్పాలిన్ కప్పిన రైతులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పలుచోట్ల అకాల వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు మండే ఎండతో భానుడు తన ప్రభావం చూపాడు. మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ జనం ఊపిరి పీల్చుకున్నారు.

తాంసి మార్కెట్‌యార్డులో తడిసిన జొన్నలు

తాంసి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం సమయంలో వర్షం కురిసింది. తాంసి మార్కెట్‌యార్డులో జొన్నలు విక్రయించేందుకు వచ్చిన రైతులు ఇబ్బందులకు గురయ్యారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో యార్డుకు తీసుకువచ్చిన జొన్నలు కొంత మేర తడిశాయి. వాటిపై టార్పాలిన్ కప్పేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీవో ఫణీందర్

తలమడుగు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. మండలంలోని లింగి గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. భూగర్భజలాలు అడుగంటి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు నెలకొన్న దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అజయ్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



సన్మాన గ్రహీతలతో తపస్ నేతలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే తప్పకుండా విజయం సాధిస్తారని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభోజు గోపీకృష్ణ అన్నారు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థి చిల్కూరి రమ(578 మా ర్కులు), జెడ్పీఎస్ఎస్ కజ్జర్ల విద్యార్థి గిజ్జ అ నుశ్రీ (576 మార్కులు), బంగారుగూడ మోడ ల్ స్కూల్ విద్యార్థి సట్లావార్ హరీష్(575మార్కులతో) టాపర్లుగా నిలిచారు. వారిని శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి అభినందించారు. మున్ముందు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు జీజాబాయి, కప్పర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, బంగారుగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, విశ్రాంత అధ్యాపకులు విజయబాబు, తపస్ నాయకులు కృష్ణ సాగర్, గోపీచంద్, గంభీర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవింద!

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం సుమారు రెండెకరాల్లో విస్తరించి ఉంటుంది. ఈ స్థలం విలువ దాదాపు రూ.వంద కోట్లకుపైనే. దేవాదాయ శాఖ, ఓ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో దీని నిర్వహణ కొనసాగుతుంది. ఆలయ ఆవరణలో ప్రస్తుతం ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించి గతేడాది అక్టోబర్‌లో దినపత్రికలో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే అందులో దేవాదాయ శాఖ ప్రస్తావన లేకుండా కేవలం ఆ ట్రస్ట్ పేరుతో ఉంది. ఓ ఆఫీసర్ దీనికి సమ్మతించినట్లుగా పేర్కొన్నప్పటికీ ఆ అధికారి ఏ శాఖ అన్నది కూడా పేర్కొనకపోవడం గమనార్హం. అదే అంశం ప్రస్తుతం వివాదాస్పదమవుతుంది.

– సాక్షి, ఆదిలాబాద్

- వేంకటేశ్వర ఆలయ ఆస్తులు సురక్షితమేనా..?
- ఆవరణలో చేపట్టిన ఫంక్షన్‌హాల్ నిర్మాణం వివాదాస్పదం
- దేవాదాయ శాఖ ప్రస్తావన లేకుండానే టెండర్ నోటిఫికేషన్
- ఓ ట్రస్ట్ తీరుపై సర్వత్రా విమర్శలు




వేంకటేశ్వర ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ అంటేనే ప్రధాన మార్కెట్ ప్రాంతం. వ్యాపార, వాణిజ్య సముదాయాలతో నిండిపోయి ఉంటుంది. అలాంటి చోట ఓ రెండెకరాల స్థలం దేవాదాయ శాఖ, ఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా కొనసాగుతుంది. స్థలం మధ్యలో వేంకటేశ్వర ఆలయం ఉండగా, చుట్టూ 46 వ్యాపార దుకాణాలు కొనసాగుతున్నాయి. వీటి ద్వారా ఏటా సుమారు రూ.50లక్షల ఆదాయం సమకూరుతుంది. అంతే కాకుండా గుడిహత్నూర్ మండలం సీతాగోందిలో ఈ ఆలయానికి సంబంధించి ఆరెకరాల భూమి కూడా ఉంది. మొత్తంగా ఏడాదికి సుమారు కోటి రూపాయల ఆదాయం వరకు లభిస్తుందని అధికారులే చెబుతున్నారు. విలువైన ఆస్తులే కాకుండా నిత్యం ఆలయానికి వచ్చే భక్తుల ద్వారా పెద్ద ఎత్తున హుండీ ఆదాయం సమకూరుతుంది. అయితే సంయుక్త నిర్వహణలో ఉన్నప్పుడు దేవాదాయ శాఖ ప్రస్తావనే లేకుండా ట్రస్ట్ పేరిట టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడం, ఆలయ ఆవరణ స్థలంలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తుండటం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. సంయుక్తంగా నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే ఇది వివాదాస్పదమయ్యేది కాదు. తద్వారా ఆలయం ఉన్న ఈ భూములపై ట్రస్ట్ కన్నేసిందా.. పూర్తిగా ఆ ఆస్తిని కాజేయాలనే కుటిల యత్నాలకేమైనా పాల్పడుతుందా అనే అనుమానాలు పట్టణ ప్రజలకు కలుగుతున్నాయి. దీంతో ఆలయ భూములు సురక్షితమేనా.. లేని పక్షంలో అన్యాక్రాంతం అయ్యే ప్రమాదమేమైన ఉందా.. అనే సందేహాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

హుండీ ఆదాయంతో నిర్మాణం..

సాధారణంగా ఆలయానికి వచ్చే భక్తుల ద్వారా కానుకలు, డబ్బులు వంటివి వచ్చినప్పుడు దా నికి సంబంధించిన లెక్కలు స్పష్టంగా ఉండాలి. సంయుక్త నిర్వహణలో ఉన్నప్పుడు అసలు ఇవి అటు దేవాదాయ శాఖకు, ఇటు ట్రస్ట్‌కు ఎంత చెందాలనే విషయాల్లోనూ ఒక స్పష్టత ఉండా లి. అంతే కాకుండా వీటిని అభివృద్ధి పనులకు వెచ్చించినప్పుడు అందులో దేవాదాయ శాఖ సొమ్ము ఎంత..? ట్రస్ట్ భాగస్వామ్యం ఎంత అనే వివరాలు స్పష్టంగా ఉంటే భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం ఉండదనే అభిప్రాయం పలువురు భక్తుల్లో ఉంది. అయితే ట్రస్ట్ ఏకపక్షంగా నోటిఫికేషన్ ఇవ్వడం, అందులో ఒక అధికారి హోదాను ప్రస్తావించినప్పటికీ కనీసం ఆయనది ఏ శాఖ అనేది కూడా దానికింద పేర్కొనకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



టెండర్ నోటిఫికేషన్‌లో దేవాదాయ శాఖ ప్రస్తావన లేకుండా ఇలా..

రెండంతస్తులకే అన్ని రూ. కోట్లా..?

వేంకటేశ్వర ఆలయ ఆవరణలో 70 X 130 చదరపు అడుగుల స్థలంలో సెల్లార్‌తో కూడిన రెండంతస్తుల్లో ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారు. దీనికి రూ.7.30 కోట్ల అంచనా వ్యయం చూపిస్తున్నారు. అయితే అందులో ఎలాంటి హంగులు కల్పిస్తున్నారు.. రాజ భవనం ఉట్టిపడేలా ఏవైన సదుపాయాలు కల్పిస్తున్నారా.. రెండంతస్తులకే అన్ని కోట్లు ఎందుకు.. అనేది ఇప్పుడు అందరిలో వ్యక్తమవుతున్న సందేహాలు. కాగా, ట్రస్ట్ సభ్యులు భారీగా స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

ఆ టెండర్‌పై స్పష్టత లేదు..

టెండర్ నోటిఫికేషన్‌లో దేవాదాయ శాఖ ప్రస్తావన ఎందుకు లేదనే విషయంలో నాకు స్పష్టత లేదు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తిగా ఇక్కడి నుంచి జరిగిన తర్వాత హెడ్ ఆఫీస్ నుంచి టెండర్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈవో వద్దే దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ఉంది.

– నవీన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆదిలాబాద్

శాఖ పేరు రాశాం.. ప్రచురణలో మారింది

టెండర్ నోటిఫికేషన్‌కు సంబంధించి మేము శాఖాపరంగా రాసిచ్చిన దాంట్లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, దేవాదాయశాఖ అని పొందుపరిచాం. ఐఅండ్‌పీఆర్‌లో మారి ఉండవచ్చు. ట్రస్ట్‌వాళ్లకు పూర్తిగా ఇచ్చే అధికారం లేదు.

– రమేశ్, ఈవో, దేవాదాయ శాఖ

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



శిక్షణ ఎస్సైలతో ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: కేసుల దర్యాప్తులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని నేరస్తులను పట్టుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సెంట్రల్ డిటెక్టివ్ ద్వారా స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో నూతన ఎస్సైలు, సిబ్బందికి రెండు రోజుల శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులు వినియోగించే ఆపరేటింగ్ సిస్టం, ఐపీ అడ్రస్, లొకేషన్ వంటివి కనుగొనే పద్ధతులను వివరించారు. అలాగే న్యాయస్థానంలో నేరస్తులకు శిక్షలు పడేందుకు కావాల్సిన పంచనామా రాసే విధానం, ముఖ్యంగా మహిళల మిస్సింగ్ కేసులు, సైబర్ క్రైమ్ ఫ్రాడ్ కేసుల్లో విచారణ చేసే పద్ధతులపై పూర్తి పరిజ్ఞానం సంపాదించాలని సూచించారు. ఇందులో జైనథ్ సీఐ డి.సాయినాథ్, రూరల్ సీఐ కె.ఫణిదర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, అఖిలేష్‌రావు, సైబర్ ఎక్స్‌పర్ట్ శ్రీధర్, డిజిటల్ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ మహేందర్‌రెడ్డి, సీడీఆర్, ఐపీడీఆర్ ఎక్స్‌పర్ట్ హైదరాబాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలకు దరఖాస్తుల స్వీకరణ

కై లాసనగర్: జిల్లాలో మట్టి తవ్వకాల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలి పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ గనులు, భూగర్భశాఖ, నిజామాబాద్ (mines.telangana.go v.in) వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. మొద టి మట్టి/గ్రావెల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి, మండల సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్‌తో స్కెచ్ గీయించుకుని, పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని పరిశీలించి సర్వే, తనిఖీ అనంతరం ఆదిలాబాద్ ఉప సంచాలకులకు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం అనుమతులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

‘సెర్ప్’ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం
- మార్గదర్శకాల కోసం ఉద్యోగుల నిరీక్షణ
- నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం

కై లాసనగర్: సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అన్ని కేటగిరీల వారు ఉంటారని ఇటీవల ప్రత్యేక జీవో జారీ చేసింది. విధి విధానాలు ఖరారు చేసి త్వరలోనే మరో ఉత్తర్వు జారీ చేస్తామని అందులో స్పష్టం చేసింది. దీంతో ఏడేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. ఇతర జిల్లాల్లో పనిచేసే వారు సొంత జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తి కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఏడేళ్లుగా తప్పని ఎదురుచూపులు

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో సెర్ప్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ వంటి రెండు విభాగాల్లో ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. సెర్ప్ పరిధిలో పనిచేసే ఏపీడీలు, డీపీఎంలు, ఏపీవో పోస్టులకు జోనల్ స్థాయిలో, ఏపీఎంలు, సీసీలకు జిల్లాస్థాయిలో బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారిలో ఏపీవో, ఈసీలు, టీసీ, డీఆర్పీ, డీడీ సీఎల్‌ఆర్‌సీ, డీబీటీ మేనేజర్, ప్లాంట్ సూపర్‌వైజర్ పోస్టులకు జోనల్ స్థాయిలో, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు జిల్లాస్థాయిలో బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. ఇతర అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరిగానే మూడేళ్లకోసారి వీరికి కూడా బదిలీలు నిర్వహించాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే ఆయా విభాగాల్లో ఏడేళ్లుగా ఈ ప్రక్రియ నిర్వహించలేదు. దీంతో సదరు ఉద్యోగులు దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తూ బదిలీ కోసం నిరీక్షిస్తున్నారు.

నిరీక్షణకు తెరపడే అవకాశం

సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు చివరిసారిగా 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బదిలీల ప్రక్రియ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు చేపట్టింది. అయితే తమకు కూడా బదిలీ అవుతుందని ఆయా విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఆశపడ్డారు. డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు కూడా చేపట్టారు. అయితే ప్రభుత్వం వారి బదిలీలకు నాడు అవకాశమివ్వలేదు. అప్పటి నుంచి వారు మంత్రి సీతక్కతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉ న్నారు. వారి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలు అందిన వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించేలా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తద్వారా జిల్లాలో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు స్థానచలనం కలగనుండగా ఇతర జిల్లాల్లో పనిచేసే వారు సొంత జిల్లాకు వచ్చే అవకాశముంది. కొత్తగా ఏర్పడ్డ మండలాల్లోనూ పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ అయ్యే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే ఉపాధి హామీ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు సంబంధించి మాత్రం ఇంకా ఎలాంటి స్పష్టతనివ్వలేదు.

జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల వివరాలు

ఏడీఆర్డీవో	01
డీపీఎంలు	07
ఏపీఎంలు	23
సీసీలు (ఎల్1, ఎల్2)	68
ఎంఎస్‌సీసీలు	45
అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్లు	06
ఆఫీస్ అసిస్టెంట్లు	03

నెలాఖరులోపు పూర్తయ్యే అవకాశం

సెర్ప్ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. త్వరలోనే మార్గదర్శకాలను ప్రకటించనుంది. వాటి ఆధారంగా ఈ నెలాఖరులోపూ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది. ‘ఉపాధి’ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రానప్పటికి వారిని కూడా బదిలీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. త్వరలోనే అందుకు సంబంధించిన ఉత్తర్వులు అందే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపడుతాం.

– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కై లాసనగర్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నార్నూర్ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వర్షాలు కురిసేలోపు వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రీచార్జ్ స్ట్రక్చర్స్, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాల పనుల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పూడికతీతలో భాగంగా ఇంకా ప్రారంభం కాని చెరువుల్లో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కమ్యూనిటీ సోక్‌పిట్స్‌ను 63 గ్రామాలకు మంజూరు చేశామని వాటిని ప్రారంభించేలా చూడాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించి ప్రతి ఒక్కరూ నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సామ్.. మామ్ పిల్లల పురోగతి, ఐరన్ ఫోలిక్ మాత్రలు, ఫాంపాండ్, బోర్‌వెల్స్, తాగునీరు, పాలంబాట, ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఇందులో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, పీఆర్ ఈఈ రాథోడ్ శివరాం, బీపీఐఎఫ్ ఎన్జీవో ప్రతినిధులు సాయి, సుధాకర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘యువ’ దరఖాస్తులను బ్యాంకులకు పంపండి

కైలాస్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధి కోసం అందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల దరఖాస్తుల హార్డ్‌కాపీలను పరిశీలించి జాబితాను బ్యాంకులకు పంపాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తనక్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలన్నారు. ఈ నెల 12 వరకు డెస్క్, బ్యాంక్ లెవెల్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, 13నుంచి 19వరకుమండలస్థాయి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం కార్పొరేషన్ల వారీగా జాబితా సిద్ధం చేసి 26 వరకు వెరిఫికేషన్ పూర్తి చేసి 29 లోగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 48,175 దరఖాస్తులు అందగా అందులో 38,911 పరిశీలించి ఎక్సెల్ షీట్‌లో బ్యాంకులకు పంపినట్లు పేర్కొన్నారు. మిగతా వాటి వెరిఫికేషన్ త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. 3, 4 కేటగిరీల్లో ఉన్న దరఖాస్తులను తప్పనిసరిగా సిబిల్ స్కోర్ వెరిఫై చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఎంపికలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికా రులు రాజలింగు, మనోహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్‌కుమార్, బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీనాయక్ వీర మరణం పొందాడు. ఆర్మీ జవాన్ చిత్రపటంతో శుక్రవారం రాత్రి మండలంలోని బిక్కుతండాలో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఘన నివాళులర్పించారు. ఇందులో గ్రామస్తులు పరశురాంనాయక్, రామేశ్వర్, రాంనివాస్, నూర్‌సింగ్, రాథోడ్ ఈశ్వర్, సురేశ్, తదితరులున్నారు.

పత్రిక స్వేచ్ఛపై దాడి



ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తూ..



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఆయా యూనియన్ల నాయకులు, జర్నలిస్టులు

- ఏపీ పోలీసుల తీరుపై జర్నలిస్టుల ఆందోళన
- కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన

కై లాసనగర్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యం చేయించడాన్ని ఆదిలాబాద్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. ఏపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రెస్‌క్లబ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. ఏపీ ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినదించారు. ఈసందర్భంగా సాక్షిపత్రిక స్టాఫ్ రిపోర్టర్ గొడిసెల కృష్ణకాంత్‌గౌడ్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సురేశ్, టీయుడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఎడిటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్ మాట్లాడారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పోలీసులతో తనిఖీలు చేసి భయభ్రాంతులకు గురిచేయడం పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందుకు అణచివేత వైఖరి అవలంబించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో బి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో ప్రెస్‌క్లబ్ కన్వీనర్ వై.సుధాకర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సారంగపాణి, సత్యనారాయణ, సందేశ్, వినోద్, వెంకటేశ్, రాజేష్, రాజేశ్వర్, రవి, ప్రవీణ్, సుభాష్, శ్రీకాంత్, నీలేష్, అభిలాష్, విజ య్‌రెడ్డి, మహేష్, సతీశ్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, పవన్, దీపక్, నరేష్, జైపాల్, అశోక్, రాజు, అస్మత్, రాకేశ్, నర్సింగ్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తమిళనాడుకు తరలిన ఆదివాసీ కళాకారులు



తమిళనాడుకు వెళ్తున్న కళాకారులు

ఇచ్చోడ: జిల్లాకు చెందిన ఆదివాసీ సకలకళా సంక్షేమ బృందం కళాకారులు శుక్రవారం తమిళనాడు రాష్ట్రానికి వెళ్లారు. తంజావూర్‌లో నిర్వహించనున్న 'సెలంగై నా ధం' కార్యక్రమానికి రావాల్సిందిగా ఆదివాసీ కళా సంక్షేమ బృందానికి ఆహ్వానం అందిన ట్లు బృందం డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో గుస్సాడీ, కొమ్ము, కోయ నృత్యాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడుకు బయలుదేరిన వారిలో కళాకారులు కాత్లే ఆనంద్, రాము, రాజేంద్రప్రసాద్, లింగు, జలంధర్, దేవురావు, పవన్, సందీప్, లక్ష్మణ్, చరణ్, ఉదయ్, అక్షయ్, భీంరావు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీ పరిధిలోని వాగు నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ సమీర్ మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి కొద్దిరోజులుగా గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడు. శుక్రవారం మార్కెట్ యార్డు సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంజాయిని పడేసి పరుగులు తీశాడు. అనుమానించిన పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. అతడి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. అతడు గంజాయి సేవించినట్లు కూడా నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే, ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన తరాట్ ప్రీతం ఈనెల 1న గంజాయి విక్రయించడంతో పాటు మరో ముగ్గురితో కలిసి సేవించాడు. అతడి నుంచి 5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బెదిరింపులకు పాల్పడి నగదు అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అర్బాజ్ పని మీద ఊరికి వెళ్లి తిరిగి రైలు మార్గం ద్వారా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చాడు. రాత్రి 12 గంటల సమయంలో పట్టణానికి చెందిన ఖాసిమ్‌తో పాటు మరికొంత మంది ఆయనను బెదిరించారు. అతడి వద్ద ఉన్న రూ.5వేల నగదు లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

జీవన రేఖ.. వివక్షకు ప్రతీక

- నది నుంచి అటవీప్రాంతం వరకు..
- విస్తరించిన బాసర–లక్సెట్టిపేట రోడ్డు
- నిర్మల్ జిల్లాలోనే అతిపెద్ద రహదారి
- దారి వెంట ఎన్నో ఆధ్యాత్మిక క్షేత్రాలు
- అబ్బురపరిచే చారిత్రక నిర్మాణాలు
- అయినా అభివృద్ధికి నోచుకోని వైనం



బాసర–లక్సెట్టిపేట రోడ్డు

భైంసా: నిర్మల్ జిల్లాకు బాసర–లక్సెట్టిపేట రహదారి జీవన రేఖగా ఉంది. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలుపుతూ 175 కిలో మీటర్ల మేర ఈ రహదారి వ్యాపించి ఉంది. రెండు జిల్లాలను కలిపే ఏకైక వారధి ఈ మార్గం అధికశాతం నిర్మల్ జిల్లాలోనే ఉంది. నిర్మల్ జిల్లాలో 125 కిలోమీటర్ల మేర విస్తరించి 13 మండలాల మీదుగా సాగి జిల్లాకు ప్రధాన రవాణా మార్గంగా ఉపయోగపడుతోంది. ఈ రహదారి పొడవునా పరిసర ప్రాంతాల గొప్పతనం, చారిత్రక అంశాలెన్నో కనిపిస్తుంటాయి.

నది నుంచి అడవి వరకు..

బాసర వద్ద గోదావరి నది ఒడ్డు నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి అడవుల గుండా లక్సెట్టిపేట వరకు విస్తరించి ఉంది. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని చూస్తూ చదువుల తల్లి ఆశీస్సులు పొంది ఎంతోమంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. పక్కనే బిద్రెల్లి వద్ద మహారాష్ట్రలోకి ఓ మార్గం వెళ్తుంది. ఈ మార్గం గుండా భైంసా వరకు రెండు వైపులా వానాకాలంలో పత్తి చేల అందాలు చూడవచ్చు. వేసవిలో విస్తరించిన భూములు కనిపిస్తుంటాయి. భైంసా వద్ద మహారాష్ట్రకు వెళ్లే మరో జాతీయ రహదారి కనిపిస్తుంది. ఈ మార్గంలో పత్తి, సోయా పంటల లోడ్‌తో వెళ్లే వాహనాలు అధికంగా కనిపిస్తుంటాయి. మహారాష్ట్ర, గుజరాత్ వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ మార్గం మీదుగా వస్తుంటాయి.

13 మండలాల మీదుగా..

నిర్మల్ జిల్లాలో ప్రత్యక్షంగా ఎనిమిది మండలాలు, పరోక్షంగా 13 మండలాల గుండా ఈ మార్గం ముందుకు వెళ్తుంది. నిర్మల్ జిల్లా అంతటిని కలిపే ఈ మార్గం విస్తరణపై అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో పెద్దదైన ఈ మార్గాన్ని మరింత అభివృద్ధి చేయాలి. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలిపే ఈ మార్గంలో అడుగడుగునా ఉన్న పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏళ్లుగా ఉన్న బాసర–లక్సెట్టిపేట మార్గంపై దృష్టిసారించాలని తూర్పు, పశ్చిమ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ..

బాసర వద్ద సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి కుంటాల మండలం కల్లూరులో సాయిబాబా ఆలయం, కాల్వ వద్ద నరసింహస్వామి, కదిలి పాపహరేశ్వరస్వామి ఆలయాలకు ఈ మార్గం గుండా వెళ్లవచ్చు. అక్కడి నుంచి నిర్మల్ చారిత్రక కోటలను దాటుకుంటూ గొలుసుకట్టు చెరువులను చూస్తూ జిల్లా కేంద్రాన్ని ఈ మార్గం కలుపుతుంది. నిర్మల్ జిల్లా ధాన్యాగారంగా పిలువబడుతున్న లక్ష్మణచాందతోపాటు మామడ, ఖానాపూర్ మండలాల మీదుగా ఈ మార్గంవెళ్తుంది. మామడ మండలంలోకి వెళ్లగానే దారి మధ్యలో ఏపుగా పెరిగిన టేకు చెట్లు, దట్టమైన అరణ్యం కనిపిస్తుంటుంది. జిల్లాలో చివరగా ఖానాపూర్‌లో గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సదర్‌మాట్ గలగలలు వినిపిస్తూ కడెం నదికి పక్కనే ఈ మార్గం జన్నారం వైపు వెళ్తుంది. దస్తురాబాద్ నుంచి అభయారణ్యంలో నల్లతాచులా మెలికలు తిరిగి కవ్వాల్ అభయారణ్యంవైపు వెళ్తుంది. ఈ మార్గం పక్కనే కవ్వాల్ అభయారణ్యంలో లేడి పిల్లల పరుగులు, నీలుగాయిల ఉరుకులు, కుందేళ్ల కోలాహలం, పక్షుల కిలకిలలు చూసి మురిసిపోవాల్సిందే.

'అందరికీ వేదం అందిస్తాం'



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

బాసర: శ్రీవేద భారతి విద్యాపీఠానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బాసర శ్రీవేదభారతి వేదవిద్యాలయం నిర్వహణకు వివిధ కుల సంఘాలతో కమిటీ ఏర్పాటు కాగా, అందులోని సభ్యులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బాసరలో వేద విద్యాలయాన్ని నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. పూర్తి భద్రత ప్రమాణాలతో పాటు వచ్చే విద్యాసంవత్సరంలో నూతన ప్రవేశాలతో వేదవిద్యాలయాన్ని పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇటీవల విద్యార్థులు లోహిత్, మణికంఠ ప్రమాదాల్లోమృతి చెందగా బాసర పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ హిందూ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా యత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనలపై కొన్ని మాధ్యమాలు అసత్య వార్తలు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. వేద పాఠశాల ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోనే ఎనిమిదేళ్లుగా వైభవంగా కొనసాగించిన దక్షిణ గంగా గోదావరి హారతి ఇక నుంచి బాసర శ్రీవేద భారతి పీఠం, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీవేద విద్యాలయ సంచలన సమితి బాసర అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ మంథని, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముప్కం రామకృష్ణగౌడ్, సహ కార్యదర్శి జాదవ్ రాజేశ్‌బాబు, సంజీవరావు, లక్ష్మణ్‌రావు, సతీశ్‌రావు, గాడేకర్ రమేశ్, తుమ్ దత్తు, బిదూర్ రమేశ్, పురోస్తు గోపాలకృష్ణ తదితరులున్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న మధుకుమార్

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి డెప్యూటీ సీఎంవో డాక్టర్ ఎం.మధుకుమార్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రికి కావాల్సిన వివిధ పరికరాలు తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. సీఎంవోగా కిరణ్ రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించాక బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి వారంలో రెండురోజులపాటు ఇతర ప్రాంతాల నుంచి ఆరుగురు స్పెషలిస్టులు వచ్చి రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. వీరి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరియా ఆస్పత్రికి కొత్తగా మరో నలుగురు వైద్యులను నియమించినట్లు తెలిపారు. గతం కన్నా ఏరియా ఆస్పత్రికి వచ్చే ఔట్‌పేషంట్లు, ఇన్‌పేషంట్ల సంఖ్య రెట్టింపైందని వివరించారు. మెరుగైన వైద్యం కోసం కంపెనీ గుర్తించిన ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రికి సరిపడా సిబ్బందిని నియమించనున్నట్లు యాజమాన్యం తెలిపిందని పేర్కొన్నారు.

దొరికిపోతామని దొంగిలించారు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి: వన్యప్రాణులను వేటాడేందుకు అడవికి వెళ్లిన వేటగాళ్లు పులుల ట్రాకింగ్ కోసం అమర్చిన సీసీ కెమెరాలకు చిక్కారు. ఇది గమనించిన వారు అధికారులకు దొరికిపోకూడదని ఏకంగా సీసీ కెమెరాలనే చోరీ చేశారు. చివరికి పోలీసులకు దొరికిపోయారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నీల్వాయి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల అడపాదడప పులి సంచారం ఉంది. వివిధ రకాల వన్యప్రాణులున్నాయి. వీటి ట్రాకింగ్‌కు పలు ప్రాంతాల్లో నీల్వాయి అటవీ రేంజ్ సిబ్బంది మార్చిలో నాలుగు సీసీ కెమెరాలు అమర్చారు. మార్చి 25న అవి చోరీకి గురి కాగా నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బొమ్మెన గ్రామానికి చెందిన కోల తిరుపతిని విచారించగా అదే గ్రామానికి చెందిన మానేపల్లి సమ్మయ్య, భట్టు కిష్టయ్య, మడె భీమయ్య అడవుల్లో బ్యాటరీ లైట్ సాయంతో వన్యప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగా మార్చి 20న నలుగురు బ్యాటరీ లైట్ సాయంతో బద్దంపల్లి అటవీ ప్రాంతంలోకి వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పులి ట్రాకింగ్ కోసం అమర్చిన సీసీ కెమెరాల ఫ్లాష్ లైట్‌లో పడ్డారు. దీంతో భయపడి అధికారులకు దొరికిపోతామనే భయంతో రెండు సీసీ కెమెరాలను తీసుకెళ్లారు. వాటిని కోల తిరుపతి ఇంట్లో దాచారు. ఆతర్వాత మైలారం అడవుల్లోకి మరోసారి వేట కోసం వెళ్లగా అదే రీతిలో సీసీ కెమెరాల ఫ్లాష్‌కు చిక్కారు. దీంతో అక్కడి రెండు సీసీ కెమెరాలు తొలగించి ధ్వంసం చేశారు. ఈ విషయమై అటవీ అధికారులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఎస్సై శ్యాంపటేల్ దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి బ్యాటరీ లైట్, నాలుగు సీసీ కెమెరాలు స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

- సొంత ఇల్లు లేక రోడ్డుపైనే మృతదేహంతో రోదించిన తల్లి



రోడ్డుపై కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న సుప్రియ

లక్ష్మణచాంద: జ్వరంతో మృతి చెందిన కొడుకు అంత్యక్రియలు నిర్వహించలేని దుస్థితిలో ఓ తల్లి పడిన వేదన వర్ణనాతీతం. వివరాలు.. నిజామాబాద్‌కు చెందిన చింతకింది లక్ష్మణ్–సుప్రియ దంపతులు మూడేళ్ల కిందట బతుకుదెరువు కోసం లక్ష్మణచాందకు వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడున్నారు. గతేడాది ఇద్దరి మధ్య గొడవ జరగగా లక్ష్మణ్ భార్య, పిల్లలను వదిలి నిజామాబాద్‌కు వెళ్లాడు. దీంతో సుప్రియ పిల్లలతో కలిసి లక్ష్మణచాందలోనే ఉంటోంది. కూలీకి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. నాలుగు రోజుల క్రితం కుమారుడు లక్ష్మీకాంత్ (12)కు జ్వరం రాగా అతడిని మొదట నిర్మల్ ఆస్పత్రిలో చూపించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. సుప్రియ పుట్టెడు దుఃఖంతో శుక్రవారం ఉదయం కొడుకు మృతదేహంతో లక్ష్మణచాందకు వచ్చింది. సుప్రియ ఉంటున్నది అద్దె ఇల్లు కావడంతో రోడ్డుపైనే మృతదేహాన్ని ఉంచి కన్నీరుమున్నీరుగా విలపించింది. తనకు ఎవరూ లేక దిక్కుతోచని పరిస్థితిలో దుఃఖించింది. గ్రామస్తులే మరో ఇంటి ఎదుట టెంట్ వేసి మృతదేహాన్ని అక్కడికి తరలించారు. చేతిలో చిల్లిగవ్వ లేని సుప్రియ కుమారుడి అంత్యక్రియలు కూడా చేయలేని పరిస్థితిలో ఉండగా గ్రామస్తులు కొంతమొత్తాన్ని సేకరించి సుప్రియకు అందించారు. చివరకు పోలీసులు అక్కడికి చేరుకుని సుప్రియ భర్త లక్ష్మణ్‌కు సమాచారం ఇచ్చారు. లక్ష్మణ్ బంధువులతో లక్ష్మణచాందకు వచ్చి కుమారుడి మృతదేహాన్ని తీసుకుని నిజామాబాద్‌కు తీసుకువెళ్లాడు.

విందు సరే.. విధుల మాటేంటి?

- ఖాళీగా ఆదిలాబాద్ బల్దియా ఇంజినీరింగ్ విభాగం



ఖాళీగా ఇంజినీరింగ్ విభాగం

కైలాస్‌నగర్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా కొందరు ఆదిలాబాద్ బల్దియా అధికారులు, ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇటీవల సెలవు పెట్టకుండా రెవెన్యూ ఉద్యోగులు మూకుమ్మడిగా కేరళకు విహారయాత్రపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారు అవస్థలు పడ్డారు. తాజాగా శుక్రవారం బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగులు కనిపించకుండా పోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో తలుపులు మూసే ఉన్నాయి. ఈ విభాగానికి సంబంధించిన అధికారులు, ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారని శాఖ ఉద్యోగులను పలువురు అడగగా లాండసాంగ్విలో విందు చేసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. విధులు నిర్వహించే సమయంలో విందులో పాల్గొనడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. అడిగేవారు లేక వారు ఆడిందే ఆటా.. పాడిందే పాటగా సాగుతోందని విమర్శలు గుప్పించారు. విందు చేసుకోవడం తప్పు కాదు గాని.. కార్యాలయ పనివేళల్లో మూకుమ్మడిగా వెళ్లడం ఏమిటని.. ఆయా పనుల కోసం కార్యాలయానికి వచ్చినవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో అధికారుల పర్యవేక్షణ గాడితప్పిందని, ప్రత్యేకాధికారి నియామకమైన నుంచి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం, ఉన్న అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ తతంగం సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉద్యోగులు ప్రతీరోజు సమయపాలన పాటించడం లేదని చెబుతున్నారు. అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును సంప్రదించగా.. లాండసాంగ్వి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన దావత్‌కు వెళ్లారని పేర్కొనడం గమనార్హం.

బీసీ జెండా ఎగురవేస్తాం

- బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజయ్‌కుమార్



బోథ్‌లో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

బోథ్: ప్రతీ పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'బీసీ మేలు కొలుపు రథ యాత్ర' శుక్రవారం బోథ్‌కు చేరింది. ఈ సందర్భంగా బోథ్‌లో బీసీ కులాల నాయకులతో కలిసి అంబేడ్కర్, కొమురంభీం, శివాజీ, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించినట్లు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా కులగణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సరైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా, పేదవారుగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీని నియమించారు. సభ్యులుగా జక్కుల వెంకటేశ్, మల్లెపూల శివారెడ్డి, కొండ స్వామి, గంగుల మల్లేశ్, కరిపి శ్రీనివాస్, ఇప్ప శ్రీనివాస్, తడక పోశెట్టి, ఏరుగట్ల రాజును నియమించారు. రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు మాచర్ల శ్రీనివాస్, నామాని అర్జున్, స్థానిక కుల సంఘాల నాయకులు బీ గోవర్ధన్, ఈ శ్రీనివాస్, కర్ణ శ్రీనివాస్, ఆళ్ల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు తరలిస్తున్న వాహనాల పట్టివేత



పట్టుబడిన వాహనాలతో సీఐ, ఏవో

తాంసి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా జొన్నలను వాహనాల్లో తరలించి శుక్రవారం తాంసి మార్కెట్ యార్డులో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు జైనథ్ సీఐ డీ సాయినాథ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజులుగా తెలంగాణ మార్కెట్‌లో జొన్నలకు అధిక ధర లభిస్తుండగా మహారాష్ట్రకు చెందిన దళారులు తెలంగాణ రైతుల పట్టాపాస్‌పుస్తకాల పేరిట జిల్లాలోని వివిధ మార్కెట్‌యార్డుల్లో జొన్నలు విక్రయిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం మేరకు సీఐ శుక్రవారం భీంపూర్ ఎస్సైతో కలిసి భీంపూర్ మండలం నిపాని వద్ద తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి జొన్నలతో వస్తున్న ట్రాక్టర్, రెండు బొలెరో వాహనాలను పట్టుకున్నారు. మహారాష్ట్రలోని ఘంటాజీ, జరూర్ నుంచి అక్రమంగా జొన్నలు తరలిస్తున్నట్లు గుర్తించారు. మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో సాయిప్రసాద్ సమక్షంలో సీజ్ చేసి మహారాష్ట్రకు చెందిన సుశాంత్, దినేశ్, సునీల్, భారత్, గోకుల్‌తోపాటు మార్కెట్‌లో జొన్నల విక్రయానికి పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చి సహకరిస్తున్న భీంపూర్ రైతులు నారాయణ, రాథోడ్ అరవింద్, వామన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై పీర్‌సింగ్ నాయక్, సిబ్బంది దినేశ్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



గులాబ్‌రావు (ఫైల్)

తానూరు: మండలంలోని దాగాం గ్రామానికి చెందిన గాడేకర్ గులాబ్‌రావు (40) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గులాబ్‌రావు కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. మద్యం అలవాటు మానుకోవాలని పలుసార్లు కుటుంబ సభ్యులు చెప్పినా పట్టించుకోలేదు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతాబాయి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామానికి చెందిన కాసరపు భూలక్ష్మి (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. భూలక్ష్మి ఎనిమిది నెలల క్రితం పశువుల దాడిలో తీవ్రంగా గాయపడ్డది. కుటుంబ సభ్యులు ఆమెకు చికిత్స చేయించినా ఆమె మంచానికే పరిమితమైంది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నర్సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి రైతు మృతి



గంగాధర్ (ఫైల్)

సర్నాపూర్(జి): ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి రైతు మృతి చెందాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురాటి గ్రామానికి చెందిన రైతు ముక్కెర గంగాధర్ అలియాస్ గంగారెడ్డి (41) తన కొడుకు రిన్నుతో కలిసి ఎద్దులను కడగడానికి శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన గంగాధర్ ప్రమాదవశాత్తు అందులో జారిపడి ఈతరాక నీటమునిగి మరణించాడు. గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో వెతకగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. చెరువులో అక్రమంగా జేసీబీలతో పెద్దపెద్ద గుంతలు తీయడంతోనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెక్‌డ్యాంలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ చాట్ల లక్ష్మి శుక్రవారం చెక్‌డ్యామ్‌లో పడి మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంజర్ గ్రామానికి చెందిన లక్ష్మి చిన్నప్పటి నుంచే మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతుండేది. ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులెవరూ లేరు. గ్రామస్తులు అందించే భోజనం తింటూ ఉండేది. మూడు రోజులుగా ఆమె కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద ఆమె మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కిందపడ్డ ఒకరికి గాయాలు

బెల్లంపల్లి: అతిగా మద్యం సేవించి కింద పడిపోయిన ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మోహన్ దుర్వే బెల్లంపల్లికి వచ్చాడు. పాత బస్టాండ్ వైన్‌షాపు వద్ద అతిగా మద్యం సేవించాడు. కాసేపటికే మద్యం మత్తులో కింద పడగా తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య వెంటనే మోహన్ దుర్వేను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు.

అడవిపంది దాడిలో ఒకరి మృతి

ఇంద్రవెల్లి: అడవిపంది దాడిలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడందా పంచాయతీ పరిధి చిలటిగూడ గ్రామానికి చెందిన మడావి బొజ్జు (58) ఆదే గ్రామానికి చెందిన పుసం నాందేవ్, మడావి మంతులు శుక్రవారం మేకలను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లారు. మేకలు మేస్తుండగా చెట్టు కింద కూర్చుని ఉన్న బొజ్జుపై అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. కడుపు, ఛాతి భాగంలో తీవ్రంగా గాయపరచగా బొజ్జు అక్కడికక్కడే మృతి చెందాడు. పుసం నాందేవ్, మడావి మంతులు చెట్టు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకుడిపై కేసు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని స్నాప్ చాట్ యాప్‌లో వేధించిన సాయి అనే యువకుడిపై ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సాయి స్నాప్‌చాట్ యాప్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని వేధింపులకు గురి చేశాడు. దీంతో సదరు యువతి షీటీంకు సమాచారం ఇచ్చింది. షీటీం సభ్యులు శుక్రవారం సాయిని పట్టుకుని బోథ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహిళలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా 8712659953 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదవశాత్తు రాడ్ కట్టర్ తగిలి ఒకరి మృతి



చంద్రకాంత్ (ఫైల్)

జైనథ్: మండల కేంద్రానికి చెందిన కోకస్ చంద్రకాంత్ (40) రాడ్ కట్టర్ తగిలి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద చంద్రకాంత్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు రాడ్ కట్టర్ ఎడమ చేయి వైపు పడింది. దీంతో అతడి చేతికి గాయమై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి చంద్రకాంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పెరాడి గ్రామానికి చెందిన కరాడే చంపత్ (27) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన చంపత్ ఈనెల 7న తన గ్రామంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.